క్లుప్తంగా

దివ్యాంగులకు బియ్యం, నూనె వితరణ


విందు భోజనం పెడుతున్న దాతలు

నగరి: స్థానిక శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ ఇ.ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ టి.మోహనలక్ష్మి బియ్యం, నూనె వితరణగా అందించారు. శనివారం పాఠశాలకు వెళ్లిన వారు దివ్యాంగుల భోజనానికి గాను 50 కేజీల బియ్యం, 15 కేజీల నూనె నిర్వాహకులకు అందించారు. దివ్యాంగులకు విందు భోజనం పెట్టారు. దాత కుటుంబ సభ్యులు గుణశేఖర్, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మహా కుంభాభిషేకం


ప్రత్యేక అలంకరించిన సత్యమ్మ తల్లి

గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాలువ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సత్యమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. గత మూడు రోజులుగా నిర్వహించిన పూజలు అనంతరం అమ్మవారికి మహాకుంభాభిషేకం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పట్టణానికి చెందిన వేంకటేశ్వర డాన్స్ అకాడమీకి చెందిన బాలికలు నాట్యంతో ప్రజలను అలరించారు. అనంతరం డాన్స్ అకాడమీ బృందాన్ని గ్రామస్తులు సత్కరించారు.

బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం


మానవహారం ఏర్పాటు చేస్తున్న మహిళలు

వెదురుకుప్పం: బాల్య వివాహ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం కవిత అన్నారు. శనివారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హింసకు వ్యతిరేకంగా డ్వాక్రా మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండర్ రహిత హింసను నియంత్రించాలన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. హింసను పారదోలాలని సూచించారు. అనంతరం మానవహారం నిర్వహించి నినాదాలు చేపట్టారు. చివరిగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్ర సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు అవగాహన పెంపొందించుకుని తద్వారా వాటిని సద్వినియోగం చేసుకోవాలని శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ సూచించారు. శనివారం పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. అలాగే సంక్షేమ పథకాలు పీఎం కిసాన్ సమ్మాన్, పీఎం ఉజ్వల యోజన వంటి 17 రకాల పథకాల గురించి వివరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందించారు. అలాగే రైతులకు డ్రోన్ ద్వారా పంటలకు మందులు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీఎం సుబ్బారెడ్డి, సీసీ కృష్ణమూర్తి, ఉద్యానవన అధికారి వెంకటసౌజన్య, పాల్గొన్నారు.

పీఎం కిసాన్ కార్డుల పంపిణీ

పాలసముద్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విద్యావతి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం పంచాయతీల్లో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచులు గాలి మహేష్ బాబు, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకాల ప్రయోజనాలను పొందలేని వారికి పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అనంతరం పీఎం కిసాన్ కార్డులను రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పేదల చెంతకే కార్పొరేట్ వైద్యం

- ప్రజలకు చేరువగా కార్పొరేట్ స్థాయి పరీక్షలు
- అందుబాటులో సీబీసీ, ఎలక్ట్రోలైట్ లాంటి అత్యాధునిక యంత్రాలు
- రూ.300 నుంచి రూ.1000కి పైగా ఖర్చయ్యే అయ్యే పరీక్షలు ఉచితం
- గత ప్రభుత్వంలో మలేరియా, టీబీ పరీక్షలకే పరిమితం
- నేడు 62 రకాల పరీక్షల నిర్వహణ
- అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

విద్యకు, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వాలు ప్రజల బాగుకోరే ప్రభుత్వాలని విజ్ఞానవేత్తలు చెబుతారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగానే ప్రజాసంక్షేమ పాలనను అందిస్తోంది. విద్యతో పాటు వైద్యానికి, ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించి వెల్‌నెస్ సెంటర్లను నిర్మించిన ప్రభుత్వం ఖరీదైన వైద్యాన్ని కూడా ఉచితంగా అందిస్తోంది.


అర్బన్ హెల్త్ సెంటర్

నగరి: మున్సిపల్ పరిధిలో నివశించే ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేసేందుకు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించింది. రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ అర్బన్ సెంటర్లలో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఆపరేటర్, ఒక అటెండర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యాధునిక సేవలను అందిస్తున్నారు. పిల్లలకు అన్ని రకాల వ్యాక్సిన్లు ఈ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 14 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా 464 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి.


పరీక్ష చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

62 రకాల పరీక్షలు నిర్వహణ..

అర్బన్ సెంటర్‌లోని ల్యాబ్‌లలో 62 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ టెస్టులు, ప్లేట్‌లెట్స్ కౌంటిగ్ టెస్టు, కిడ్నీ సంబందిత టెస్టు, యూరిన్, సోడియం, పోటాషియం టెస్టులు, డయాబెటీస్, హైపర్‌టెన్షన్ ఉండేవారికి లిక్విడ్ ప్రొఫైల్ టెస్టులు, స్పుటమ్ టెస్ట్ అంటూ 62 రకాల పరీక్షలు ఈ సెంటర్లలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. వాటికి సంబంధించిన కిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వంలో అర్బన్ హెల్త్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్లు లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, టీబీ పరీక్షలు మాత్రమే నిర్వహించే వారు. ఈ పరీక్షలకు కూడా కొన్ని సమయాల్లో కిట్లు ఉండేవి కావు. అలాంటి దయనీయ స్థితి నుంచి నేడు కార్పొరేట్ వైద్యం నివాసాలకు సమీపంగానే అందే పరిస్థితి వచ్చింది.

కార్పొరేట్‌ను తలపించేలా ల్యాబ్‌లు..

కార్పొరేట్ ఆస్పత్రులలో మాత్రమే అందుబాటులో ఉండే సీబీసీ, ఎలక్ట్రోలైట్ మెషిన్లు, బయోకెమిస్ట్రీ అనలైజర్, యూరిన్ అనాలసిస్ యంత్రం లాంటి అత్యాధునిక టెస్టింగ్ మెషిన్లు, బ్లడ్ టెస్టింగ్ మెషిన్లు అర్బన్ హెల్త్‌సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ పరీక్షలు బయట ల్యాబ్‌లలో చేసుకోవాలంటే ఎలక్ట్రోలైట్ సోడియం, పొటాషియం టెస్టు రూ.1000, లిక్విడ్ ప్రొఫైల్ టెస్టుకు రూ.600, యూరిన్ టెస్టు రూ.200, డెంగీ టెస్టు రూ.600, టైఫాయిడ్ రూ.300, మలేరియా నిర్ధారణ టెస్ట్‌కు రూ.300 చెల్లించాల్సి ఉంది. ఈ పరీక్షలన్నీ రోగులకు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉచితంగా అందుతున్నాయి.

అత్యాధునిక సేవలను వినియోగించుకోవాలి



కార్పొరేట్ ఆస్పత్రులలో మాత్రమే ఉండే అత్యాధునిక టెస్టింగ్ మెషిన్లు డాక్టర్ వైస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉన్నాయి. నైపుణ్యం కలిగిన ల్యాబ్ టెక్నీ షియన్లు, వైద్యులు ఉన్నారు. వేలకు వేలు పెట్టి చేసుకునే పరీక్షలన్నీ ఉచితంగా చేయడం జరుగుతుంది. పరీక్షలకు సంబంధించిన కిట్లు కూడా అర్బన్ సెంటర్లలో ఉన్నాయి. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ రవిరాజు, డీఐఓ, చిత్తూరు


సీబీసీ మెషిన్


ఎలక్ట్రోలైట్ మెషిన్


బయోకెమిస్ట్రీ అనలైజర్,


యూరిన్ అనాలసిస్ మెషిన్


బ్లడ్ టెస్టింగ్ మెషిన్

ఉపాధి హామీలో అవకతవకలకు చెక్


తనిఖీ నివేదికలను పరిశీలిస్తున్న అధికారులు

- డ్వామా పీడీ గంగాభవానీ

నగరి: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరగకూడదని డ్వామా పీడీ గంగాభవానీ తెలిపారు. శనివారం నగరి మండలంలో 2022 ఏప్రిల్ 1 వతేదీ నుండి 2023 మార్చి 31 వరకు 21 గ్రామపంచాయతీల్లో 16వ విడత సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించి గ్రామసభలను నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో వచ్చిన సమస్యలపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో తనిఖీ బృందం వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆడిట్‌లో వచ్చిన వాటిని చదివి వినిపించారు. మండల పరిధిలోని 21 పంచాయతీల్లో ఓజీకుప్పం, అయనంబాకం పంచాయతీల్లో రూ.3,856 రికవరీ చేయగా, 12 పంచాయతీల్లో జరిగిన పొరబాట్లకు రూ.3,750 జరిమానా వేశారు. అనంతరం డ్వామా పీడీ గంగాభవాని మాట్లాడుతూ 21 పంచాయతీల్లో రూ.9.66 కోట్ల మేర ఉపాధిహామీ పనులు జరిగాయన్నారు. వీటిలో వేతనాలకు రూ.8.12 కోట్లు వెచ్చించగా, మెటీరియల్‌కు రూ.1.54 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో ఉపాధి పనుల్లో కొన్ని అవకతవకలు జరిగినట్లు కనుగొన్నామని రికవరీలు చేయడం, జరిమానా విధించడం జరిగిందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు రికార్డులను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, డీపీఓ భాగ్యలక్ష్మి, నగరి క్లస్టర్ ఏడీ శోభన్‌బాబు, ఎంపీడీఓ లీలామాధవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఏపీఓ కవిత, ఎస్‌టీఎం కోనయ్య, అబ్బర్వర్లు శ్రీదేవి, నమశ్శివాయం, రాఘవేంద్ర, సామాజిక తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిండ్రలో..


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుణ

నిండ్ర: గ్రామాల్లో ఉపాధిహామీ పనులను నాణ్యతగా చేయాలని, లేదంటే సంబంధిత వారిపై చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ గంగాభవానీ అన్నారు. శనివారం మండలంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం గుర్తించిన వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సమాచారం మేరకు పనులు జరిగే ప్రదేశాల్లో వివరాలు తెలిపే బోర్డులు ఉంచలేదని తెలిపారు. దానికి తోడు రికార్డులు పొందుపరచడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీలకు పనులు కల్పిండంతో పాటు సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా నాటిన మొక్కలు చనిపోతే అదే చోట మళ్లీ మొక్కలు నాటాలని కోరారు. మండలంలో ఉపాధిహామీ పథకం కింద 2022–23 మార్చి వరకు 908 పనులు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో రూ.97,806 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, సర్పంచ్ వసంతమ్మ, ఎస్ఆర్పీ నాగేంద్ర, ఏపీఓ ఇందుమతి పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే సాధికారత

కార్వేటినగరం: సామాజిక సాధికారతను ఆచరణలో చూపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోగన్‌రెడ్డికే దక్కుతుందని మండల కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొల్లాగుంట సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే ఎన్నికల్లో మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం కొల్లాగుంట గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, గతంలో చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, నాయకులు మునికృష్ణ, సుబ్రమణ్యం, గాంధీ, అయ్యప్ప, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు వాసి దాత దీపక్‌కుమార్ కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రెండువందల మందికి పైగా అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. దీపక్‌కుమార్ టీటీడీ అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి అనేకసార్లు అన్నదానం చేపట్టి తమ దానగుణాన్ని చాటుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.


వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దాతలు

పోలింగ్ కేంద్రం తనిఖీ


పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి భవానీ

శ్రీరంగరాజపురం: మండంలోని 49 కొత్తపల్లి గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 136, 137, 138 పోలింగ్ కేంద్రాలను గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డిప్యూటీ కలెక్టర్ భవానీ తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే కొత్త ఓటర్ల చేర్పులు, మరణించిన వాళ్లు, ఆడపిల్లలకు పెళ్లిళ్లు అయి వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజు, మండల సర్వేయర్ మురళి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


ఆముదాల పోలింగ్ కేంద్రంలో ఓటరు దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైనదని, ఓటుతోనే నేతల రాతతో పాటు దేశ భవిష్యత్‌ను కూడా నిర్ణయించవచ్చని తహసీల్దార్ బాబు తెలిపారు. శనివారం మండలంలో బీఎల్‌ఓలు 24 పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఓటరు దరఖాస్తు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన ఆముదాల, పాలసముద్రం, కృష్ణజమ్మపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. బీఎల్‌ఓ ఓటరు యాప్ వెర్షన్ 4.7 ద్వారా నూతన ఓటర్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారానే చేయాలని తెలిపారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఓటర్లకు నోటీసులు ఇచ్చి, ఆ తరువాతనే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చెరుకు రైతుల బకాయిలు చెల్లించండి


చెరుకు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నిండ్ర: రైతులకు నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం తక్షణం చెరుకు బకాయిలను చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రైతులతో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన ఎంతోమంది రైతులు ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసి నాలుగేళ్లు గడుస్తోందన్నారు. కానీ రైతులకు చెల్లించాల్సిన రూ.37 కోట్లు బకాయిలను నేటికీ ఇవ్వలేదని ఆరోపించారు. ఫ్యాక్టరీ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ముంబైకి చెందిన ఓ ఫైనాన్స్ కంపెనీకి కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేపట్టామన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమకు బకాయిలు ఇచ్చిన తరువాతే ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన వారితో పాటు వారి తరఫున అడ్వొకేట్ రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసి నగరి రూరల్ సీఐ శ్రీనివాసంతి అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. తక్షణం రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల తరఫున కోర్టులో కేసు వేసి యాజమాన్యం నుంచి బకాయిలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

చినుకు కురిసే.. మంత్రి మురిసే



అనునిత్యం ప్రజల మధ్యన గడిపేందుకు మంత్రి రోజా ఇష్టపడతారు. ప్రజలకు మంచి చేస్తే వచ్చే ఆనందమే వేరని ఆమె తరచూ చెప్పే మాట. ఇటీవల నియోజకవర్గంలో ఆమె 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పల్లెనిద్ర. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తూ బిజీ బిజీగా ఉన్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం మంత్రి రోజా పుత్తూరు పట్టణ పరిధిలోని తాయిమాంబాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే చినుకులు పడుతున్నా కూడా ఆమె ప్రజలకు మధ్యకు వెళ్లారు. అదే సమయంలో ఆమె వర్షంలో తడుస్తూ ప్రకృతిని ఆస్వాదించారు. సరదాగా ఆమె స్టెప్పులు వేస్తూ సందడి చేయగా, జనం ఆనందంగా వీక్షించారు.

– పుత్తూరు

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం


మాట్లాడుతున్న ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్

వెదురుకుప్పం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలన్నారు. లేదంటే నేటి సమాజంలో ఏ రంగంలో కూడా రాణించలేమన్నారు. అనంతరం కామర్స్ విభాగ అధిపతి భరణినాథ్ రెడ్డి కంప్యూటర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా కంప్యూటర్ ఆవశ్యకత, ఉద్యోగ అవకాశాలు, ఎలాంటి కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయనే అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే వివిధ రకాల ఇబ్బందులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు మున్వర్, శ్రీనివాసులు, ఇస్మాయిల్, నరేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మంగళగౌరి, అధ్యాపకులు నాగేశ్వర రావు, భీమమోహన్ రావు, సరిత, లావణ్యకుమార్ పాల్గొన్నారు.

వంట చేస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి..


చికిత్స పొందుతున్న నాగరత్నమ్మ

పుత్తూరు: పట్టపగలే ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన శనివారం పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. పరమేశ్వరమంగళం గ్రామంలో మునిరత్నంనాయుడు (82), నాగరత్నమ్మ(70) దంపతులు నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం నాగరత్నమ్మ ఇంట్లో ఉండగా ఇద్దరు యువకులు మోటర్ సైకిల్‌పై వచ్చి నేరుగా ఇంట్లోకి వచ్చారు. వంట చేస్తున్న నాగరత్నమ్మ మెడలోని 5 సవర్ల బంగారు గొలుసును లాక్కునేందుకు ప్రయత్నం చేయగా, ఆమె ప్రతిఘటించింది. అయితే దుండగులు ఆమె ముఖంపై తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయింది. దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన మునిరత్నంనాయుడు అపస్మారక స్థితిలో ఉన్న భార్యను చూసి కేకలు వేశాడు. గ్రామస్తుల సాయంతో నాగరత్నమ్మను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మునిరత్నంనాయుడు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం


దాణా పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

వెదురుకుప్పం: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని బ్రాహ్మణపల్లె రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై దాణాను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల కోసం ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పశువైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ బ్రాహ్మణపల్లె రైతులకు సంపూర్ణ సమీకృత మిశ్రమ దాణాను రైతులకు 60 శాతం రాయితీ ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. 23 మంది రైతులకు 7 టన్నుల దాణా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మిశ్రమ సంపూర్ణ దాణా ద్వారా అధిక పాల దిగుబడిని పొందవచ్చన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కేశవులు, పశుసంవర్ధక శాఖ సహాయకురాలు జరీన, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్, పాడి రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు డిజిటల్ లావాదేవీలపై కళాజాత

నిండ్ర: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిజిటల్ లావాదేవీలు ఆర్థిక అక్షరాస్యతపై మండల కేంద్రమైన నిండ్రలో శనివారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల్లో నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే కళాజాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, వ్యాపార రుణాలు పూర్తిగా నగదు రహిత లావాదేవీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా వీధి నాటికలు నిర్వహించారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు మేనేజర్ శరవన కుమార్, సీఈఓ కుబేరుడు తదితరులు పాల్గొన్నారు.